''రాత్రి పది అయితుందీ. గింత సేపట్దాంక యాడికి వోయింద్రురా?''..

రాంపాల్ రెడ్డి సేటు మాట ఇనపడంగనే, సోయిల కొచ్చి తల గోక్కుంటా..

''సిన్మాకు వోయినం సేటు!'' అన్నడు పతంగి.

''అయితెమాయె గానీ.. మనింటికి వోయి ఈ మందులు సేటమ్మకు ఇచ్చిరా!'' అనిచెప్పి.. మందుల సంచి పతంగి చేతికిచ్చిండు రాంపాల్ రెడ్డి.

''నేను పనిమీద శంషాబాద్ ఎల్తున్ననీ.. రాత్రికి ఇంటికి రాననీ సేటమ్మకు చెప్పు!'' అని.. ఆటో కిరాయి లకని రెండొందలు వాడి చేతిలో వెట్టిండు.


మారు మాట్లాడకుండా.. సుక్కి దిక్కు చూస్తూ.. 'పోయొస్త!' అన్నట్లు సైగ చేసిండు.

సుక్కి గూడ 'సరే!' అన్నట్లు తలూపి, తమ గుడిసె వైపు వెళ్లిపోయింది.

పతంగి రోడ్డు దాటి.. సనత్‌నగర్ పోయే ఆటో ఎక్కిండు. ఆటో కదిలింది. పతంగి ఆలోచనలు రాంపాల్ రెడ్డి వైపు మళ్లినయి.

నాలుగు నెలలుగా రాంపాల్ రెడ్డి స్క్రాప్ దుకాణం సరిగ్గా నడుస్తలేదు. దినాం నాలుగైదు లారీల స్క్రాప్ లోడ్ ఎత్తేటోడు. ఇప్పుడు వారానికి ఒక లారీ గూడ ఎత్తుతలేదు. ఆడ కొత్తగా వేరేటోళ్లు స్క్రాప్ దుకాణం పెట్టిండ్రు. రాంపాల్ రెడ్డి కంటే ఎక్కువ పైసలిస్తున్నరు. దాంతోని గుడిసెలోళ్లంతా స్క్రాప్‌ను గా కొత్త దుకాణంలనే అమ్ముతున్నరు. కొన్నాళ్లు ఇట్లనే ఉంటే.. రాంపాల్ రెడ్డి దుకాణం ఎత్తేసుడు ఖాయం!

ఆటో బ్రేక్ ఏసుడుతోని.. ఆలోచన బంద్‌జేసి ఆటో దిగిండు పతంగి. వానల నడుసుకుంటనే సేటు ఇంటికి చేరుకున్నడు.



మందుల సంచి సేటమ్మకిచ్చి..

''నేను వోతున్న సేటమ్మా!'' అని ఎనిక్కి తిరిగిండు.

''గీ వానల యాడికి బోతవ్ రా? అన్నం తిని ఈణ్నే పండుకో! పొద్దున్నే పోదువుగాని!'' అన్నది సేటమ్మ.

పతంగి ఆలోచనల పడ్డడు. టైం పన్నెండయితున్నది. ఉంటెనే మంచిదనుకున్నడు. తిన్నంక.. సేటమ్మ ఇచ్చిన చాప దుప్పటి దీసుకొని హాల్‌లనే పండుకున్నడు. కానీ, నిద్రయితే పడుతలేదు. సుక్కే కండ్లల్ల తిరుగుతున్నది. పిచ్చిదానికి తనంటే ఎంత ప్రేమో! అనుకుంట ఆలోచనల్ల పడ్డడు. అటు ఇటూ దొర్లి.. టైం చూసిండు. రెండు దాటింది. వాన జరంత తగ్గింది. వానికి సుక్కే యాదికొస్తున్నది. ఆడ ఉండబుద్ధి కాలే! లేసి పక్క దుప్పట్లు మడిచివెట్టి బయటవడ్డడు. నడ్సుకుంటనే ఇంటిబాట వట్టిండు.




తెల్లవారుజాము నాలుగు అయితున్నది. సుక్కిని ఓసారి చూసొద్దమని ఆళ్ల గుడిసె కాడికి వోయిండు. అలవాటు లెక్కనే తడికెల తలుపు సందులంగ లోపటికి సూసిండు. అంతే! వాడి గుండె భళ్లున పలిగింది. వేయి పిడుగులు ఒక్కసారిగా వాని మీద పడ్డట్టు వణికివోయిండు. చూసింది నమ్మలేక పోతున్నడు. మళ్లమళ్ల చూసిండు. కల కాదు.. నిజమే!

సగం బట్టల్లేకుండా సుక్కి మత్తుగ నిద్దట్లో ఉంది. కాళ్లూ – చేతులు సుక్కి మీదేసి, నిద్రవోతున్నడు రాంపాల్ రెడ్డి. ఆవేశంతో నరాలు బిగుసుకున్నయి పతంగికి. తట్టకోలేకవోతున్నడు. వాని కండ్లు నిప్పు గోళాల్లెక్కయినయి.

'రాత్రి నాకు మాయమాటలు సెప్పి, మందుల వంక తోని వాల్లింటికి తోలి.. నా సుక్కిని నాకు కాకుండ జేస్తడా? ఈ నా కొడుకును బతకనియ్య! ముక్కలు ముక్కలుగా నరికెయ్యాల! ఆ.. అంతే!'..

అట్లా అనుకున్నదే తడువుగా.. ఎప్పుడో పాత ఇనుప సామాన్లలో వచ్చిన మూరెడు పొడవు కత్తిని గుడిసెలో దాచిపెట్టింది యాదికొచ్చింది. క్షణం ఆలస్యం చేయకుండా గుడిసెకాడికి ఉరుకుతూ, బాట పక్కన పడుకోనున్న కుక్కపిల్ల తోక తొక్కిండు. అది 'కుయ్యో'మని మొరగవట్టింది. పతంగి దాన్ని పట్టిచ్చుకోకుండ తన గుడిసె కాడికొచ్చి, కత్తి బైటికి దీసిండు. ఒక్క దెబ్బకే ఆని తల తెగిపడాలె అనుకుంటనే.. సుక్కి గుడిసె కాడికొచ్చిండు. ఓ చేత్తో కత్తిని అంగిలోపట దాచిపెట్టుకుని.. కుంటి కాలితోని తలుపును ఒక్క తన్ను తన్నిండు. అది ఊసిపోయి గుడిసె లోపటవడింది. కుంటికాలు నిలదొక్కుకోలేక తూలి పడవోయి సంబాళించుకొని నిలవడ్డడు.

బయట కుక్క మొరిగినప్పుడే రాంపాల్ రెడ్డి నిద్రలేసిండు. బట్టలేసుకొని.. తనకు లేత కొబ్బరి ముక్కలాంటి సుక్కి భార్యగా దొరికిందనీ, ఇంకా తన పాచిక పారిందనీ తృప్తిగా, సంతోషంగా ఉన్నడు సేటు.

సంపదను పోగేసుకునేందుకు ఏసే ఎత్తుగడల్లో.. పెద్ద పెట్టుబడిదారుడికీ, చిన్న పెట్టుబడిదారుడికీ పెద్ద తేడా ఉండదు. ఇద్దరిదీ ఒకటే సిద్ధాంతం. అమాయక శ్రమజీవుల్నీ నయానో భయానో లోబర్చుకోవడమే! రాంపాల్ రెడ్డి గూడా అదే చేసిండు. ఒక్క దెబ్బకు రెండు పిట్టల్లా.. సుక్కి తనకు దక్కింది. గుడిసెలోళ్లకు చుట్టమైనందుకు వ్యాపారం నిలబడింది. అట్ల సంతోషకర ఆలోచనల్లో ఉన్న రాంపాల్ రెడ్డి, గభాల్న తలుపు తన్ని లోపలికొచ్చిన కుంటోణ్ని చూసి..

''ఏందిరా కుంటోడా? తలుపు ఇరిగేలాతన్ని లోపలికొచ్చినవ్? మందులు సేటమ్మకిచ్చినావా?'' అనడిగిండు.

అనుకోనిది జరిగేసరికి కంగారుపడి తేరుకొని..

''ఆ! ఇచ్చొచ్చిన సేటు!'' అన్నడు పతంగి.

రాంపాల్ రెడ్డి పొడువుగా – లావుగా – బలంగా ఉంటడు. పతంగి కోపంతో ఉడికిపోతూ..

'నా కొడుకు పడుకొనే ఉంటే గనక ఈపాటికి తల తెగిపడేది' అనుకున్నడు.

ఇప్పుడేం చేయాలో తోస్తలేదాడికి. కోపంతో లోపట కుతకుతా ఉడికివోతున్నడు. వాని కండ్లు చింత నిప్పుల్లాగున్నయి.

కుంటోడు అనుమానించి తనను తప్పుగా అర్థం చేసుకున్నడని గమనించి..

''రేయ్ పతంగీ! నిన్న నీకు చెప్పుడు మర్సిన. రాత్రి సుక్కిని పెళ్లి చేసుకున్న!''..

అనుకుంట సుక్కి దగ్గరికి వోయి..

''ఇగోసూడు!'' అని సుక్కి మెడల కట్టిన పసుపుతాడు సూపించిండు.

''సుక్కి నా రెండో భార్య! ఇప్పటిసంది సుక్కిని పేరు పెట్టి పిల్వమాకు. 'చిన్న సేటమ్మా!' అని పిలువ్. సమజైందా? గీ సంగతి ఇప్పుడే పెద్ద సేటమ్మకు ఎర్కగానియొద్దు!'' అని.. జేబులంగ పైసలు తీసి, వెయ్యి రూపాయలు పతంగి జేబులో వెట్టిండు.

''బట్టలు కొనుక్కో! చికెన్ బిర్యానీ గిట్ల తెచ్చుకొని దావత్ జేస్కో! నా పెండ్లి దావత్! అర్థమైందా?'' అని పతంగికి చెప్పి..

అటువైపు తిరిగి పడుకోనున్న సుక్కితో..

''సుక్కీ! నేను ఎల్తున్న! పదకొండింటికల్ల వస్త. లేసి స్నానం చేసి, రెడీగా ఉండు. సొమ్ములు కొననీకి బంగారం కొట్టుకువోదం!!'' అన్నడు.

మెల్ల పతంగిని సూసుకుంట..

''పోతున్నరా కుంటోడా!'' అన్చెప్పి ఎల్లిపోయిండు రాంపాల్ రెడ్డి.

పతంగికి సర్రున మండింది.

'ఎవడ్రా కుంటోడూ? లం.. నా కొడకా! మీ బుద్ధులు కుంటియి! మీరు కుంటి నా కొడుకులు! ఇగో చేసేదంతా చేసి.. నన్ను మోసంచేసి, ఏం ఎరగనట్టు నంగనాచిలా పడుకుందే.. గీ సుక్కి, ఇది కుంటి నా లం.. ది! ఇక్కడ ఎవడ్రా కుంటోడూ.. నా కొడకా?' అని రాంపాల్ రెడ్డి దిమ్మ దిరిగేలా తిట్టాలనుకున్నడు. కానీ, మాటలు గొంతులోనే అడ్డువడ్డయి.

వాడి మనసు గత్తర గత్తరైతంది. కసి.. అందరి మీదా కసి. ఈ లోకం మీద కసి. అంతే! కసిగా బైటికొచ్చిండు. కాంద్రించి గుడిసె మీద ఉమ్మేసిండు. గబగబా తన గుడిసెలకు వోయి.. వలవలా ఏడ్సిండు.

సుక్కి ఇంత అన్యాయం చేస్తదనుకోలేదు. బొందిలో ప్రాణముండగా మళ్లా సుక్కి ముఖం చూడకూడదని దూరంగా వెళ్లిపోవాలనుకున్నడు. లేచి బట్టలు సదురుకున్నడు. పెట్టెలున్న పైసలు దీసుకొని బైటికొచ్చిండు. వానల తడ్సుకుంట రోడ్డునవడ్డడు. నా అనే వారు లేని, దయాగుణం అసలే లేని ఈ మాయదారి లోకంలో ఏ తీరాలకో.. ఈ ఒంటరి బాటసారి పయనం?

* * *

బయటికి వోయిన పతంగి కాంద్రించి ఉమ్మేసినప్పుడే.. సుక్కికి తెలివైంది. ఆడు ఉమ్మింది గుడిసె మీద కాదనీ.. తన మీదేననీ సుక్కికి అర్థమైంది.

'నన్నిట్లా సూసి వాని గుండె పలిగి ఉంటది. ఎంత బాధవడ్డడో? నన్ను మోసగత్తె అనుకున్నడేమో!'.. అనుకుంట, రెండు చేతుల్తో తల బాదుకుంటూ గుండెలవిసేలా ఏడ్సింది. అసలు రాత్రి ఏం జరిగిందో ఒక్కొక్కటిగా యాదిజేసుకోవట్టింది.

* * *

మందుల సంచి దీసుకొని పతంగి అటెల్లంగనే.. సుక్కి తాముండే గుడిసెల కాడికొచ్చింది. గుడిసెల మద్దెన పండగలూ, కార్యాలూ జరుపుకొనే షెడ్డుకు లైటింగ్ చేసి ఉంది. శానమంది గుమిగూడి ఉన్నరు.

'ఏం జర్గుతున్నదిక్కడ?' అనుకుంట షెడ్డుకాడికి వోయింది సుక్కి. అంతల్నే..

''అగ్గో.. సుక్కి వచ్చింది!'' అన్నరెవరో గుంపులంగ. ముగ్గురు వదినెలు, ఇద్దరక్కలు తనకాడికొచ్చి..

''యాడికి వొయినవ్ గింత రాతిరిదంకా? జల్ది వోదంపా!'' అంటూ తనను తమ గుడిసెకాడికి లాక్కొచ్చిరు.